సాటిక:

# ఒమార్ ఖయ్యాం

= శ్రీ శివరాజు వెంకట సుబ్బారావు =

(బుచ్చిబాబు)

పాత్రలు:—

| | | |
|---|---|---|
| ఒమార్ | — | కవి, సౌందర్య పిపాసి |
| ఆగాషాహి | — | వొక కొత్త శిష్యుడు |
| మురాద్ | — | ఒమానా యువరాజు |
| హ్రుమునిస్సా | — | కాశ్మీర స్త్రీ |
| తహూరాజీవా | — | (?) |

౧

ఒమానాలో యిసుకదిబ్బవెనక ఒమార్ గుడారం. దిబ్బకి దూరంగా పానశాల. గుడారంముందు కొలను. ఒడ్డున చిత్రమైన మూడు చెట్లు. సాయంత్రం మూడుగంటలు. ఆగాషాహి మట్టికుండమీద అలంకారంకోసం గీతలు చిత్రిస్తున్నాడు. మట్టికూజా బుజాన పెట్టుకుని హ్రుమునిస్సా అతనివైపు నడుస్తుంది.

***

ఆగా—అల్లాగే నిలబడు. కదలకు. కదిలితే నీ వంకరతిరిగిన అవయవాలు నన్ను, నన్ను...ఎట్లాగంటే...

హ్రుము—నువ్వొచ్చి వారం కాలేదు, అప్పుడే నావెనకపడ్డావ్? ఎప్పుడూ నీకళ్లు నామీదే, అదేం కర్మమో! గురూజీ జ్ఞానసమాధిలో వున్నప్పుడు నువ్వు......

ఆగా—నీ శరీరసమాధిలో పడి మైకం పొందుతున్నా. తన్మయత్వానికి ఆకారంలేని ఆలోచనకంటె ఆకారం గల నీలాంటివస్తువు దగ్గరమార్గమని నిన్న నేగా ఒమార్ నీతో అన్నది?

హ్రుము—స్వార్థంతో కూడుకున్న తాత్కాలికాభిప్రాయం అది. లోకమంటే ఏమిటో తెలియని నాటినుంచీ నన్ను తనదగ్గరకు తీసుకుని, అవసరమున్న కాసేపు మాయకబుర్లతో నన్ను ఆరాధించి, వాడిన పువ్వులా విసిరి ఆలోచనలో పడతాడు.

ఆగా—ఛీఛీ! కాని నీలో వాడిపోడం లేదు. ఆయనప్రేమకిమల్లేనే నీ శరీరానికికూడా చావు లేదు.

హ్రుము—అన్నీ దొంగమాటలు నీవి. నాప్రభువు నిన్ను అనుమానించడం లేదు కదా అన్న చొరవవల్ల నన్ను స్తుతించి చలింపజేసి మోసగించటం న్యాయంకాదు. కాదు న్యాయం నన్ను రగల్చడం.

ఆగా—అబ్బ!—ఓహో, ఆమాటలు చెప్పేటప్పుడు నీ కళ్లల్లో కనిపించే బాధ ఎంతో గమ్మగా వుంది.

అబద్ధాలు చెపుతోంటే నువ్వెంతో అందంగా వున్నావ్. నన్ను అల్లరి చెయ్యడం నీకు భలే యిష్టం. మన ఆనందం మనలను మోసగించుకునే శక్తిమీద ఆధారపడింది అని గురువు చెప్పాడు మొన్న. నీకు నామీద యిష్టంలేకపోతే, ఎప్పుడో ఒమార్‌తో చెప్పివుందువు. అవునా?

హ్రాము—(నవ్వి) టక్కర్ మాటలు బాగా కూస్తావ్. నీ చూపు దొంగచూపు. నవ్వు నీది కొంటె.*

ఆగా—నిన్నే నేనల్లా అంటే, నీకెంత హుషార్‌గా వుంటుంది! నాకుండే నీ శరీరాన్ని వర్షం చుక్కలు మేఘాన్ని ఆవరించినట్లు చుట్టుకుంది. కూజాబరువుకి సొట్టపడింది నీ బుజం. ఓహో! వాటి వంకర, నునుపు, మృదుత్వంతో కూడుకున్న గట్టితనం, రొమ్ముల భారానికి విరిగి ముక్కలై కిందపడే ఆ నడుం...అన్నీ గడ్డంవెనక మూతపడ్డ ఒమార్ అధరాలకు అర్పిస్తావా?

హ్రాము—అదుగో అసూయ! మొగాడి గొప్ప జాడ్యం! నువ్వు మాటలు నేర్చిన జంతువ్వి. నీ పెళ్లాం నిన్ను చూసి సిగ్గుపడి విరక్తిచెందిందంటే ఆశ్చర్యంలేదు.

ఆగా—అది నీకెవరు చెప్పారు?

హ్రాము—నువ్వు నా ప్రభువుతో చెబుతుంటే విన్నా.

ఆగా—ఇది నీకు తెలీకుండా వుంచాలనుకున్నా. తెలిస్తే నువ్వు అసూయపడొచ్చు.

హ్రాము—ఛ, ఛ! నేను వుద్రేకాలకు అతీతం ...

ఆగా—పురుషుడిదగ్గర తప్ప ...

హ్రాము—ఛీ! ప్రభువుకి విశ్రాంతి యివ్వడంకంటే వేరే ఆదర్శం లేదు. లేవు నాకు వాంఛలు.

ఆగా—నీ ప్రభువుకోసం నీ కోర్కెలు త్యాగం చెయ్యడంకూడా వొకవిధమైన స్వార్థమే. జ్ఞానానికి స్వార్థమే మొదటిమెట్టు. లయలేని యీ లోకాన్ని పుట్టించడంలో అల్లా తన స్వార్థాన్ని ప్రకటించుకున్నాడు.

హ్రాము—నానడకలో లయ లేదు? లేదా లయ నా అవయవాల వొయ్యారపు కులుకులో ...?

ఆగా—ఓహో! నిన్ను వాంఛించి ఓడిపోయినవాడిది కదా జన్మ!

హ్రాము—ఇంత బలహీనుడవు, అల్పుడవు కాబట్టే నీ భార్యలో వేడి చల్లారి గడ్డకట్టింది.

ఆగా—కారణం అదికాదు. చీకటిచేసే ముసుగు కప్పుకుని శరీరాన్ని నాదృష్టినుంచి దాచుకుని, జీవిత స్వప్నగానంలో అపశ్రుతి మోగించి మూగదైంది.

హ్రాము—ఒమార్ వద్దనుంచి దొంగిలించిన ధ్వనులివి. నువ్విక్కడికొచ్చింది నాకోసమా, నా ప్రభువు కోసమా?

ఆగా—నీ ప్రభువుబోధనవల్ల కాబోలు నామనస్సు నిన్ను కోరుతోంది. నీలోని శిల్పమే ఆయన్ని యింత గొప్పకవిగా చెయ్యగలిగింది. నేనూ, నిన్ను వొక్కసారి తాకితే, అంతటి కవిని కాగలనని ఆశగా వుంది. నాలో దాగివున్న కవిత్వప్రవాహానికి దారిచూపలేకపోయింది నాభార్య.

హ్రాము—మూలం కాదు నేను ఆయనకవితకు. అతను ఆ శృంగారమయప్రపంచంతో విరక్తిచెంది అధోలోకంలోకి దిగకుండా అడ్డుపడే ...

ఆగా—మంచుకొండ నీ శరీరం. నీఅధరాలని తాకితే, కైలాసగిరిమీది మంచులా, కవిత్వపుధార వుద్భవించొచ్చు. నాలో ప్రతి అణువు కోరుతోంది; ప్రతి రక్తపుచుక్క ...

హ్రాము—పిచ్చివాడవ్! చర్మం తాకటంతో పుట్టే నీ కవిత్వం అంతే లోతు కలిగివుంటుంది.

ఆగా—లోతులేనిదే కవిత్వం. దాని ఔన్నత్యం వేగంపైన, సహజత్వంపైన ఆధారపడివుంటుంది. లోతు

---

* వాక్యం తలక్రిందులు చెయ్యడం హ్రామూ లక్షణం.

కలది వేదాంతం కావొచ్చునని ఒమార్ చెప్పలేదు? అదుగో వెళ్లిపోతున్నావ్. నా పొగడ్తలతో మనస్సు నిండించుకుని, వేటకు నన్ను రగిల్చి వెడుతున్నావ్. నాకు అందకపోడంలో వుందనుకుంటా నీ గొప్పతనం.

హామ—కాదు. ఎవరో స్త్రీ నా ప్రభువుగుడారంలోకి ప్రవేశిస్తోంది. ఆమెను చూడు...అబ్బ—దూరంనుంచే ఎంతో బాగుంది.

ఆగా—దగ్గరనుంచి బాగుండేదానవు నువ్వొక్కదానవే. కప్పుకోకు. వెక్కిరించి, ధ్వంసంచేసే ఆ చూపులు-రాజాబగువుకి చర్మం కంది సంధ్యారాగంలో రేఖకింద మెరిసి, ముద్దుకోసం ముడుచుకున్న ఆ పెదవులు-వొక్క క్షణం—గతించిపోతున్న కాలవాహినిలో వొక్క సుడిగాలి—మృత్యువుకి అర్పించేముందు, వొక్కసారి నాకు...

హామ—అబ్బ-అమ్మో-వొద్దు. ఇంకా వెలుగుంది. ఉయ్యాల వూగుతోంది. కడసారి కిరణం ... వుండమంటే! ఇప్పుడు కాదు. ఆ వొచ్చిన స్త్రీ నీ భార్య కాదుకదా?

ఆగా—చంద్రుడు, నక్షత్రాలు,—యివ్వాళ మనిద్దరికే.

## ౨

అదే సమయం. ఒమార్ గుడారంలోపలిభాగం. ఒమార్ మట్టి అరుగుమీద తివాచీపై కూర్చుంటాడు. పళ్లెంలో ద్రాక్షపళ్లు, అత్తిపళ్లు, వ్రాతపరికరాలు. కిటికీలో వొక పుర్రె తప్ప యితరఅలంకారాలు ఆ గదిలో లేవు. తల చేతుల్లో పట్టుకుని కళ్లు మూసుగుంటాడు ఒమార్. పాతికేళ్ల స్త్రీ లోపకి ప్రవేశిస్తుంది.

***

స్త్రీ—నేను నమస్కరించే గురువు ఒమార్ ఖయ్యామ్ అని తలుస్తా.

ఒమార్—ఈ ప్రపంచం నన్ను అల్లా అవడానికి నిశ్చయించుకుంది. ఈ మధురమైన కంఠం ఏ స్త్రీదో తెలియదు.

స్త్రీ—మీలా విచారంలో వున్న వొక స్త్రీది.

ఒమార్—నావిచారాన్ని పంచుకునేందుకు సమకట్టిన యీ స్నేహితురాలి రాక పానశాలనుంచి కాదుకదా!

స్త్రీ—కాదు ప్రభూ.

ఒమార్—పేరు వినాలని వుంది.

స్త్రీ—తమ్‌హారా జీవా ప్రభూ.

ఒమార్—మంచిపేరు. నీ కంఠధ్వనిలోలాగే నీ పేరులోకూడా దుఃఖం వుంది. బాధ ఎంత అందంగా వుండగలదో తెలుసుకోవాలన్నవాళ్లు నీ పేరు వినాలి. విచారాన్ని మనసారా ప్రేమించి, కన్నీటితో చెలిమి చేద్దామని బయలుదేరిన స్త్రీ నేటివరకూ లోకంలో జనించలేదు, స్త్రీ...కాదు,—ఏదో పేరు చెప్పావ్?

స్త్రీ—తమ్‌హారా జీవా.

ఒమార్—అవును. ఆ నామాన్ని రోజూ పదిసార్లు వుచ్చరిస్తే పంటిసలుపు పటాపంచలై పోతుంది.

తమా—నేను స్నేహంకోసం రాలేదు ప్రభూ. నాదుఃఖం పంచుకోటానికి వీల్లేనిది—అందులో పురుషులతో

ఒమార్—పొరపాటు స్త్రీ. సకలమానవకోటినీ ఏకంచేసేది విచారం. దీన్నుంచే ప్రేమ జనించింది. అల్లా మానవబాధకి జాలిపడి ప్రేమిస్తాడు. నక్షత్రం, పసిపాప బాధలో జన్మిస్తాయి. మొదటి ముద్దులో ప్రణయ బాధ—మృత్యువులో నోరులేని బాధ. బాధలో కవి పాటలు పాడతాడు; కుంచెని కన్నీటిలో ముంచి

చిత్రకారుడు పటాలు గీస్తాడు. సృష్టికి మూలమైన విచారంకంటె యథార్థం వుందా స్త్రీ? నిట్టూర్పుతో నీ బాధ చెప్పకోవా స్త్రీ...?

తమా—నా పేరు ఫలానా అని చెప్పాను గురూ.

ఒమార్—ఏమీ అనుకోకు. నాదృష్టికి స్త్రీలు స్త్రీలే, పురుషులు పురుషులే. నామధేయాలు స్వార్థాన్ని బలపరుస్తాయి. నువ్వు పేరు మరచి స్త్రీగా సంబోధింపబడటం ఎంత చిత్రమైన అనుభవమో నీకు తెలుస్తుంది. ఎన్నో అభిప్రాయాలు తారుమారౌతాయి. (తలెత్తి పైకి చూస్తాడు)... ఓహో,—యీ వెలుగుతో నా అర్థవిహీనమైన సంభావణ! ఈ ఐదు నిముషాలు. తిరిగి పొందలేని అనుభవాన్ని పోగొట్టు కున్నాను. ఇల్లాగే, ఎన్నో కాంతికిరణాలను పోగులుకుని, జీవితాన్ని చీకటిచేసుకుంటారు మాయమానవులు.

తమా—ప్రభువు నా వునికిని గుర్తిస్తున్నట్లు లేదు.

ఒమార్—ఉనికిని గుర్తిస్తే అనుభవం నశిస్తుంది. నిజమైన అనుభవానికి నేత్రాలుకాని చెవులు లేవు స్త్రీ. నన్ను వినమనకు—చూడమను.

తమా—నేను తమ అనుభవంకోసం రాలేదు గురూ.

ఒమార్—అవును. నీ అనుభవంకోసమే వొచ్చావని నాకు తెలుసు. నేను నిన్ను అనుభవించడంలోనే నీ అనుభవం వుంది. అంతే స్త్రీలు. వారికి తమని లోకం గుర్తించి, చూసి, మెచ్చుకుందంటే, సంతోషం పూర్తి అవుతుంది. కాని, వారికిమాత్రం, లోకాన్ని అర్థంచేసుకుందామన్న వాంఛే లేదు. స్వయంకృషివల్ల వ్యక్తిగతమైన అనుభవం పొందాలని మొదలే లేదు. వారు కొండలు, మేఘాలు, నదులు, పుష్పాలు—వీట్లకిమల్లే చూసి, అనుభవింపబడి, పొగడబడేందుకే. ప్రకృతిని గుర్తిస్తేనేకాని సృష్టి లేనట్లు, స్త్రీని గుర్తిస్తే కాని సృష్టి లేదు. ప్రకృతి కెంతటిహృదయం వుందో వారికీ అంతే.

తమా—గురూ, తమతో సృష్టినిగురించి, అనుభవాన్ని గురించి తర్కించడానికి రాలేదు. మీతో పనుండి వొచ్చాను.

ఒమార్—లోకంతో నాకు పనిలేదు. 'పని' నాకు శత్రువు. పనంటే ధనం. స్త్రీలకీ పురుషులకీ కావల్సింది ధనం. ధనంలేని నాబోటి బీదపురుషుని స్త్రీ దూషిస్తుంది. నీకు నాతో ఏం పని? స్త్రీ, ముసుగు తియ్యి. ముసుగుతో ప్రపంచాన్ని ఎంతకాలం మోసగిస్తావు? ఓహో, ఆ రెండు జడలు, అల్లుకుపోయిన నల్ల త్రాచుపిల్లలలాగా ఆ శిరోజాలు, నుదురుపై కిరీటంవలె అమర్చబడ్డ ఆ కనుబొమ్మలు—నువ్వు మహారాణీవి స్త్రీ.

తమా—నా కంత భాగ్యంకూడానా గురూ? నావిచారం వినరూ?

ఒమార్—విచారం చూడరూ అని అడగాలి. నా జీవితకాలం యిట్లా చూస్తో కూర్చోగలను నిన్ను. ఏదో బాధ నీకళ్లని కలవరపెడుతోంది. ఆమాటలు భయంతో బైటికి రాలేక కంఠంలోని పచ్చనరాలను పీడించి, శంఖంకింద గీతలుగా మెరుస్తున్నాయి. ఆ దృశ్యానికి వాక్కు ఎందుకు స్త్రీ? నేనే రాజునైతే, నిన్ను కైలాసశిఖరంపైన కూర్చోపెట్టి, లోకాన్ని చూసి మరణించమని కోరుదును. రెల్లుగడ్డిచాప తాకిడికే ఎర్రబడిన పాదాలు రాణీపాదాలు. ఆ ఎత్తైన, బరువైన పిరుదులను భరించే సింహాసనం ఏదేశంలో వుంది? సృష్టికోసం నిన్ను యీలోకానికి పంపిన దైవానికి దూరదృష్టి లేదు. నిన్ను తాకేందుకు ఏరాజుకి చేతులాడతాయి?

తమా—గురూ, మీరు స్త్రీముందు అనకూడని సంగతులు అంటున్నారు. నేను రాణీని కాను. నేను నా భర్తకోసం వొచ్చాను.

ఒమార్—అవును. నీ కొక్కటే కర్తవ్యం వుంది. అది సృష్టి. దాన్ని పూర్తి చేసేందుకు, పురుషుని వెతుకుతూ యిల్లా నాకో దర్శనం యిచ్చావు. లేరు, స్త్రీ, లేరు నీ కొరకు వుద్దేశింపబడ్డ పురుషులు. ఉన్న వాళ్లల్లోనే మంచివాణ్ణి ఎన్నుకోవాలి.

తమా—ఒమార్, తమరు నీచమైన భావాలవల్ల ఎంతో నొప్పి కలిగిస్తున్నారు.

ఒమార్—అవును, సత్యం ఏకంగా హృదయాన్నే బలికోరుతుంది, శరీరాన్ని కాదు. ఈ సత్యం వచించడంలో ఎంత బాధ పడ్డానో తెలుసా? ఇవి సామాన్యులు చెప్పలేరు. నేనూ, నీలాంటిది నాముందు లేకపోతే, చెప్పివుండకపోదును. కవిత్వానికి, సత్యానికి సౌందర్యం అనే వొక భౌతికవస్తువు ఎంతటి పరిపూర్ణత తీసుకొచ్చిందో తెలుసా?

తమా—మీరు ఏ గొప్పసత్యం కనుక్కోలేదు. మీరు చెప్పినవన్నీ వినడానికి యింపుగా వుండే అబద్ధాలు. నాభర్త నన్ను వొదిలి, తమ ఆశ్రమంలోకి వొచ్చాడని విన్నాను. నేను అతనికోసం వొచ్చాను.

ఒమార్—నాకర్థం కావడం లేదు. ఈ శక్తితో, యీ శీవితో వెలిగిపోతున్న నీ శరీరానికి, యీ లోకంలో వోభర్త దొరికాడా? ఘోరం, ఘోరం. ఈ దౌర్భాగ్యుడు, లోకాన్ని నిన్ను చూడకుండా చేశాడా, 'భర్త' అని పేరెట్టుగుని! ముసుగువెయ్యకు,—వొద్దు. నీ చరిత్ర స్వప్నంలో స్వప్నంలా వుంది. నిజంగా నువ్వు పానశాలనుంచి రాలేదుకదా!

తమా—లేదు కవీ. నాకూ నాభర్తకీ దురభ్యాసాలు లేవు. ఆయన మీపాటలు విని, స్వేచ్ఛగా జీవించి ప్రేమించవొచ్చునని, నన్ను త్యజించి మీ ఆశ్రమంలోనికి వొచ్చాడని విన్నాను. మీ రిట్లాంటి పాడునీతులు బోధించి, నాసంసారం పాడుచెయ్యడం న్యాయమా కవీ?

ఒమార్—నిన్ను వొదులుకున్న భర్తకి సౌందర్యం అంటే ఏమిటో తెలీదనుకుంటాను. నీలో సౌందర్యం పరిపూర్ణత పొందింది, తన యాత్ర ముగించుకుంది. ఇక్కడ దిగే అల్పసౌఖ్యాలన్నీ వాటి బరువులేని రెక్కలిని ముడుచుకుని, శాశ్వతంగా వుండిపోయేందుకు, ఉక్కుపురెలకింద మారతాయి. నీభర్త దౌర్భాగ్యుడైవుంటాడు. ఒకవేళ, నీ సౌందర్య బంధనాల బరువుకి తట్టుకోలేక, నీ ఎర్రటి శక్తిని భరించలేక, అలసట తీర్చుకునేందుకు, స్వేచ్ఛకోసం పారిపోయివుంటాడు కాని, నాకవిత్వంవల్ల కాదు స్త్రీ. కవిత్వాన్ని విశ్వసించి, జీవితాన్నే తారుమారు చేసుకునే వ్యక్తులు యీ విశ్వంలో వున్నారా అని అనుమానం.

తమా—మీకవిత్వం స్త్రీలని ఆకర్షించేందుకని విన్నా. శరీరాన్ని సుఖింపజెయ్యమంటారుట మీరు; పరలోకం, దైవం, పాపపుణ్యాలు మానవకల్పితాలు కాని యథార్థాలు కావంటారుట మీరు. నీతి నియమాలను త్రోసిపుచ్చి తుచ్ఛవాంఛకి శరీరాన్ని అమ్ముకుని బానిసలు కమ్మంటారుట మీరు. మీ బోధనలు సంసారులకూ, పతివ్రతలకూ చేసే హాని, హానే లేదన్న మీబోంట్లకు ఎల్లా తెలుస్తుంది? చర్మం అంత లోతుగల చక్కదనం శాశ్వతమా ప్రభూ? అన్నీ అసత్యాలు, అశాశ్వతం ఐనప్పుడు వాంఛ, సంతోషంకూడా అశాశ్వతం కాక స్థిరమా కవీ?

ఒమార్—స్త్రీ, నిన్నెల్లా అభినందించాలో తెలియదు. నాకవిత్వంలోని సారమంతా క్లుప్తంగా మూడుముక్కల్లో శెలవిచ్చావు. కాని నాబోధనలను నువ్వు అంగీకరించి మెచ్చుకోకపోతే నీ కింత విశదంగా నాపద్యాలు అర్థమైవుండవు. ఆఖరికి, వో స్త్రీకి కూడా నా ఏడ్పు వినపడిందంటే, నా కవిత్వంపై నాకు ఎక్కువ ఆశ, నమ్మకం కలుగుతున్నాయి స్త్రీ. పతివ్రతలకి నా బోధ చేసే హానిని గురించి నిశ్చయంగా చెప్పావు. మొదట్లో—కవిత్వానికి పాడైపోయిన నీతి వుంటేనేం, లేకపోతేనేం? పాడవనివారికి నీతిలోని విలువ, సౌభాగ్యం ఎట్లా తెలుస్తాయి? అనేకమంది వేదాంతులు 'నీతి' అనే భవనంలోకి ప్రవేశించారు. ఎన్నో దినాలు వెదికి, దాన్ని తెలుసుకోలేక, బోడితలలు వూపుకుంటూ, వెళ్లినమార్గాన్నే బైటికి వొచ్చారు. దాన్ని కనుక్కోవడానికి వారు వ్యర్థం చేసిన కాలంలో వారిలో కలిగిన మార్పు, వారి బోడితలలపై వాలుగు తెల్లవెంట్రుకలు మొలిచాయి. శరీరం పుట్టినప్పుడు చిన్నదిగా పుట్టి పెరిగి పెద్దదయి అభివృద్ధి

చెందుతుంది. ఆత్మ ముసలిగా జన్మించి, వయస్సు ముదిరినకొద్దీ పసిపాపలా మారుతుంది.— అది జీవితంలో గొప్ప విషాదకరమైన సత్యం.

తమా—అయ్యా, మీతో వాదించేందుకు రాలేదు. నాభర్తను నాకు చూపండి.

ఒమార్—నీభర్త నా ఆశ్రమంలో లేడు. నాదగ్గరకు ఆగాషాహి అన్న వొక యువకుడు వొచ్చి, కొన్ని దినాలనుంచి వుంటూ నాతో ఎంతో స్నేహంగా వుంటున్నాడు. అతనికి నాకవిత్వం అంటే ఎంతో యిష్టంట.

తమా—మీదగ్గర ఎందరు స్త్రీ లున్నారు?

ఒమార్—ప్రస్తుతం హ్రమనిస్సా అని నా ప్రియమైన చిన్ని స్త్రీమట్టుకు వుంది, ఎన్నో నాళ్లనుంచి. ఇంకెవ్వరూ లేరు.

తమా—ఐతే, ఆస్త్రీకోసమే వొచ్చివుంటాడు.

ఒమార్—నా హ్రములో కుట్రలేదు, మోసం లేదు. అది ప్రేమనుగురించి వితర్కించుకోదు. దానికి స్త్రీపురుష వివక్షతే లేదు. నా ఆగా గొప్ప తార్కిక జ్ఞాని. నే నతనిదగ్గరనుంచి తెలుసుకోవల్సినవి యెన్నో వున్నాయి.

తమా—ఆగాషాహియే నా భర్త.

ఒమార్—అతనూ భార్యని వొదిలి, సంసారంబాధ పడలేక వొచ్చినవాడేకాని, నీ అంతటి చక్కటి భార్య వుందని ఎన్నడూ చెప్పలేదే. అతను మానసిక కష్టాలని హరింపజేసే హ్రమనిస్సాశరీరాన్నే ఎంతో మెచ్చుకున్నాడు. బహుశ, నీభర్తకి మానసిక స్నేహం యివ్వలేకపొయ్యావేమో నువ్వు. మళ్లా వొదిలి నీతో వొస్తాడా అని అనుమానం. ఎడతెగని స్వేచ్ఛ కూడా వొకవిధమైన బానిసత్వం కావడంచేత, బహుశ నీతో రావొచ్చు. నీలాంటి పుష్పాలు, అప్పుడప్పుడు వాసనచూడడానికే సృష్టింపబడ్డాయి కాని, పెళ్లిచేసుకుని పాడుచేసేందుకు కాదు. పుష్పానికి ముళ్లున్నట్టు, నీకు శూన్యత్వం, గర్వం, అలంకారారాధన, సృష్టికి తోడ్పడి నువ్వు కనబోయే బిడ్డలకోసం నువ్వు చెయ్యగలిగిన త్యాగం కల్పించబడ్డాయి నీలో. తన చక్కదనాన్ని, హోదాని చూసి మోహించి, అతనితో నువ్వు దినాలు గడపడానికి అంగీకరించావనుకున్న పురుషుడు శుంఠ. ఆ మోహించడం, కాపరం అన్నీ నీ స్వార్థం కోసమే—నీ సృష్టికోసమే. భావలేని గొప్ప కవయిత్రివి నువ్వు. నీ కర్తవ్యానికి తోడ్పడి నిర్వహించలేకపోయిన పురుషుణ్ణి క్షమించవు నువ్వు. దానికోసం పురుషులకొన్ని, నీతిని బలియివ్వడానికి వెనుదీయవు. అల్లా ఐవుండికూడా, యీ దుర్బలుడు ఆగాషాహికోసం మళ్లా వేటాడుతున్నావంటే, అతను యింకా నీకార్యం సాధింపగలడని నీకు ఆశ వుందని తేల్తోంది. అతన్ని పిలుస్తా.

తమా—అమ్మ! యిప్పటికి ముగిసింది మీగొడవ. తొందరగా పిలవండి.

ఒమార్—(చప్పట్లు కొట్టి ఆగాషాహిని పిలుస్తాడు) ఓహో! సూర్యుడు ఇసుకతిన్నెల వెనక కాలు గాయపడినవాడిలా కుంటుకుంటూ దిగుతున్నాడు. గాయంలోని రక్తం ఆకాశాన్ని ఆవరించింది. పానశాల నుంచి ఒంటెలమంద, పుండుమీద వాలబొయ్యే పురుగులలా నడుస్తున్నాయి. గాలికి ఇసుకకెరటాలు మేఘాలవలె లేచి చంద్రబింబానికి జోహారు లిస్తున్నాయి. పోయింది వెలుగు; శక్తి భూమిని వొదిలి శృంగారానికి చోటిస్తోంది. (మళ్లా పిలుస్తాడు. ఆగాషాహి వొస్తాడు).

నీకోసం నీభార్య వొచ్చింది. నాహ్రము ఏదీ?

ఆగా—విహారంకోసం పానశాలవైపు వెళ్లింది.

ఒమార్—లేకపోతే దాన్ని వొదిలి యింత తొందర్లో వొద్దువా?

ఆగా—గురుజీ పరిహాసం. మనిషిలా మాట్లాడుతుంటే వినాలని వుంది. ఇందుకేనా నన్ను పిల్చింది?

ఒమార్—అదుగో చూడు ఆస్త్రీని. నీరాణి. ఏమీ పనీ పాటా లేక సోమరిగా తిరిగే నీకు, కాలక్షేపానికి లోకం నీకు ప్రసాదించిన భార్య.

ఆగా—గురుజీ పరిహాసం. నా కింకా వినాలని వుంది. కాని పరాయిస్త్రీముందు తగని పని.

ఒమార్—స్త్రీ, యీదౌర్భాగ్యుడైన నీభర్త జీవించేది నీ అడుగులలోనా, అధరాలలోనా?

తమా—తప్పు ప్రభూ. చీకటిపడినకొద్దీ తమభావాలకి స్వేచ్ఛ మరింత ఎక్కువవుతుంది కాబోలు. భార్యని ఎందుకు వొదిలి యిల్లా వొచ్చాడో తమరు కనుక్కోవాలి.

ఒమార్—స్త్రీ, మీ ప్రణయకలహాలని నాముందు ప్రదర్శిస్తే, చూసి సానుభూతి చూపేవాణ్ణి కాను. ఇతరుల ప్రణయగాథలు వినడంకంటె విసుగుపుట్టించేది మరివొకటి లేదు. ఆగా, నీభార్యకు సమాధానం యివ్వాలి. నాఆశ్రమగౌరవం నిలబెట్టాలి.

ఆగా—ఇదేం గొడవ? ఈమె నాభార్య కాదు ప్రభూ. ఈమెను నే ఎప్పుడూ చూడండే. వేళాకోళం ముగిస్తే నే వెడతాను.

ఒమార్—కాదు ఆగా, నువ్వు దాక్కుని లాభంలేదు. నువ్వు యీస్త్రీని వొదిలి చాలాదినాలు జీవించ లేవు. మరోస్త్రీ హస్తాలలో చిక్కుకుంటావు. ఎక్కడున్నా స్త్రీ నీశరీరాన్ని తన సృష్టికి బలిగా కోరుతుంది.

తమా—చాలాదినాలు, వెనక అన్యోన్యంగా వున్నాము.

ఆగా—నాకు వెనక లేదు.

ఒమార్—నిజం. మాభాషలో నిన్న, రేపులు లేవు. నేడు అతనికి నువ్వు, నువ్వతనికి అవసరం వుంటే కలిసి లేచిపొండి.

తమా—నాభర్తతో నే వుండడం నాహక్కు.

ఒమార్—అది సృష్టికి నువ్వు చెల్లించే సుంకం.

ఆగా—అసలవన్నీ ఎందుకు? ఈమె నాభార్య కాదు. ఇంత చక్కటి భార్య నా కెక్కడేడిసింది! తమ తన్మయతకి యీస్త్రీ మన ఆశ్రమంలో అవసరం ప్రభూ. ఏమంటారు?

ఒమార్—భర్తవున్న స్త్రీని నే ముట్టను.

ఆగా—భర్తను నే కాను. నాభార్యే అని చెప్పుతుంది కాబట్టి......

తమా—నువ్వు భార్యను వొదిలివొచ్చావా లేదా?

ఒమార్—అది ముందు చెప్పు.

ఆగా—నిజం కావొచ్చు. కాని నువ్వు నాభార్యవు కావు. ఇదేం కర్మ? నాభార్య పొట్టిది. నీలా దానికి బుగ్గమీద మచ్చ లేదు. దానికి రెండు జడలు లేవు. జుట్టంతా వూడి దానికసలు జడే లేదు.

తమా—ఆకారణంచేత వొదిలిపెట్టావా?

ఆగా—కారణాలు నీ కనవసరం.

ఒమార్—ఐనా, స్త్రీమీద ఏవగింపు పుట్టినతర్వాత, ఆమె ఎల్లా వుండేదీ మరిచిపోయివుండొచ్చు నువ్వు. దగ్గరగా పరీక్ష చెయ్యి స్త్రీని.

ఆగా—అల్లాగే ..అబ్బే, ఏకోశాన్నీ నా భార్యకాదు. ఏమాత్రం ఆలక్షణాలే లేవు, ప్రభూ. ఏదో వొం కట్టుకుని తమదగ్గర వుందామని పన్నింది.

ఒమార్—ఈస్త్రీనిగురించి నువ్వు శుష్కించి శత్రులను చంపుకుంటే నీదీక్ష, నీకవిత్వధార నశిస్తుందన్న భయంచేత నీభార్యని వొదిలివొస్తే నేను నిన్నేమీ అనను. నిజంగా యీవిడ నీభార్య కాకపోయినా, యీస్త్రీ అవునంటోంది కాబట్టి, ఆమెతో వెళ్లడానికి సిద్ధంగా వున్నావా?

ఆగా—గురూజీ, నన్నిలా పరీక్షచేస్తే నేఎల్లా చావను? స్త్రీలు అప్పుడప్పుడు అవసరంగాని, భార్యలు కాదు.

తమా—ఘోరం, ఘోరం!

ఒమార్—ఐతే నీ కీస్త్రీ అక్కర్లేదన్నమాట.

ఆగా—ఇంత పచ్చిగా అడిగితే ఏంచెప్పను? తమరికి అక్కర్లేకపోతే ఆలోచిస్తాను.

ఒమార్—అల్లాగైతే, బైటికి పోయి ఆలోచించుకో.

ఆగా—బ్రతికించారు, శెలవు. (వెడతాడు)

తమా—ఒక్కమాట.

ఆగా—ఏమిటది?

తమా—ఒకానొకదినం, నీభార్య నీళ్లు తెస్తుంటే గాలికి ముసుగు జారిందని వొంకని, నీభార్యని హింసించావా లేదా?

ఒమార్—ఏమిటి? ఈదుర్బలుడికి స్త్రీని కొట్టేటంతటిశక్తికూడా వుందా? అందులో నీఅంతటిదాన్ని!

ఆగా—గురువుగారు గొప్పగా అడిగారు. ఈమెను నే హింసించగలిగానంటే ఎవడు నమ్ముతాడు?

ఒమార్—ఆగామాటలు నిజం. లేకపోతే, ఏపురుషుడు స్త్రీముందు తన బలహీనతను ప్రదర్శించుకుంటాడు—అందులో పరాయిస్త్రీముందు ? ఇదే సత్యంకోసం స్వార్థాన్ని త్యాగంచెయ్యడ మంటాను.

తమా—తరవాత, గదిలో దీపం తగ్గించి ఆమెముసుగు నువ్వు తొలగించినప్పుడు ఆమె సిగ్గుపడిందని హింసించినమాట నిజమేనా?

ఆగా—నేను నాభార్యని ఏంచేస్తే నీకెందుకు? అసలు, యివన్నీ నీ కెల్లా తెలిశాయి ?

తమా—నీభార్యని కాబట్టి.

ఆగా—పురుషవంచకురాలు ప్రభూ, వేటకత్తె...ఎంతమంది నీవలలో పడ్డారు?

ఒమార్—అల్లాహో కుమ్మన్.

తమా—నోరు మూసుగో.

ఆగా—పైగా యీదౌర్జన్యం ఏమిటి? ప్రభూ, నాకు శెలవు. ఈమె దయ్యంలా వుంది. అల్లా యీమె నుండి మిమ్మల్ని తప్పించుగాక! ఈపుర్రె తమ చేతులో వుంచుకోండి,—పిశాచం పారిపోతుంది. (వెడతాడు)

ఒమార్—స్త్రీ, నన్నుగురించి విని, చూడడానికి రావడానికి యీపన్నాగం పన్నాలా? నీలేతఅధరాలని "నిన్ను ప్రేమించా" అని అనడానికేనా వోపిగ లేదా? నాలో ఏ ముంది స్త్రీ? కాని స్త్రీ సౌందర్యం కోరదు కాబట్టి నాకు కొంత ఆశగా వుంది. నువ్వు నాదగ్గర వుండాలి. నాఊహాసామ్రాజ్యానికి నిన్ను రాణీని చేస్తా. నా గానానికి శ్రుతిలా మోగించుకుంటా. ఎడతెగని జీవితపుఎడారిలో, నీ రెప్పలనీడలో నిద్రపోతా నేను.

తమా—అందరి స్త్రీలనీ యిల్లాగే అంటారా?—మీహృమ్ము చాలదా?

ఒమార్—స్త్రీగానంలో అసూయ అనే అపశ్రుతి. హ్రమ్ము తలకాయలేని శరీరం. స్వప్నాలులేని మలిన జీవితం దానిది. నీటికింద నాచు. నాతో ఆకాశంలోకి విహారం చెయ్యలేదు. లోయలోకి దిగుదా మంటుంది. అన్నం పెడుతుంది, పాదా లొత్తుతుంది. కాని తను తనలాగే వుండిపోతుంది. నీలా దానికి నాలో ప్రవహించే శక్తి లేదు. సర్వనదులలోని నీరమూ తనమీదినించి ప్రవహిస్తుంటే చలించని శిలలాంటిది నాహృదయం.

తమా—తమకు స్త్రీలతో నిమిత్తం ఎందుకు?

ఒమార్—నాకు స్త్రీలతో నిమిత్తం లేదు. వ్యక్తులను మంచిచెడ్డలను బట్టి గౌరవించను. నేను ఆరాధించేది స్త్రీ అనే వొక ఆదర్శమైన సౌందర్యాన్ని. నే నెవరో్న తెలియని నాకు ఏ ప్రత్యేకమైన వస్తువు పైనా వాంఛ లేదు. నాకు సరైన వ్యక్తిత్వం లేదు; స్థిరపడిన ప్రవర్తన లేదు. నాభావాలు సౌందర్యాన్నుంచి బలాన్ని పూరించుకుని, మార్పునుంచి మాధుర్యాన్ని పొంది, ముందుకు నడిచి అర్థశూన్యత్వంలో మూగవౌతాయి. తోవలో కొంత మాధుర్యం, కొంత బలం దిగపడి సంఘానికి దొరుకుతాయి. అవే నాపద్యాలు. నీలాంటి వస్తువులు మార్గాన అడుగడుక్కీ తగలకపోతే ఏనాడో నా కీలోకం చీకటవును. నిన్ను చూసినకొద్దీ, లోకాన్ని కవిత్వంతో జయించగలనని భ్రమకల్గుతోంది.

తమా—ఇంతవరకూ మీరు వ్రాసిన కవిత్వంవల్ల పదిమందీ పాడవడం చాలదనా?

ఒమార్—తప్పు, స్త్రీ. నన్ను, నన్ను పుట్టించిన సంఘాన్ని, దాని నీతిని నిందించు. కవిత్వదూషణ తగదు స్త్రీ. కవిత్వంలో అమరతలేని సత్యానికి ఎంతో దగ్గిరగా వొస్తాను నేను. అదిలేని సమయంలో నేను చచ్చినవాడికింద లెక్క.

తమా—లోకానికి పనికిరాని పిచ్చిపాటలు వ్రాయడం ఎందుకు ? ఆ కాలం పనికొచ్చేపనికి వినియోగించి పేరుపొందరాదూ ? కవిత్వంతో పొట్టగడుస్తుందా ?

ఒమార్—లేదు స్త్రీ. స్త్రీలకు ధనవంతుడే గొప్పవాడని గుడ్డినమ్మకం. అందుకే వారు నాబోటి బీదలతో స్నేహం చెయ్యరు. లోకానికి పనికొచ్చే పని చెయ్యగలను ; బుట్ట నెయ్యగలను ; తివాచీలపై చిత్రాలు వెయ్యగలను ; కుండలు చెయ్యగలను - అల్లా మాదిరిగా ; ఎంతో ధనం ఆర్జించగలను. బంగారంకొరకు చేతులు చాచాను; కాని, మధ్య రెండు సుందరమైన అధరాలు అడ్డుతగిలాయి. వజ్రవైడూర్యాలకోసం పరుగులెత్తాను ; కాని రెండు ప్రేమగాయాలు తగిలాయి. సింహాసనంకోసం గడ్డం దువ్వాను ; కాని రెండు అధరాలు ముద్దుకోసం ముడుచుకున్నాయి. లోకం నాదని విర్రవీగాను; రెండు అధరాలు కాదని వెక్కిరించాయి. మృత్యువుని చూసి పెదవివిరిచాను; బాధ బలిగా కోరింది నాప్రేమని. పాపపుణ్యాల ఫలితాలని మృత్యువు జయించింది. కాని, అయ్యో, ప్రేమ మృత్యువుని జయించలేకపోయింది. నాప్రేమ వుండేందుకు యీలోకంలో స్థలం చాలక కొత్తలోకాన్ని కల్పించాను. విప్పుకున్న కనురెప్పలక్రింద శయనించాను. నిద్రలో ఊహాలోకి జారాను. జయించాననుకొని చప్పట్లుకొట్టాను. అధరాలనుచూసి వెక్కిరించి, 'మీరు రాలేరు'అన్నాను. కాని, నేనే ఓడిపోయ్యాను. స్త్రీ,ధనం ఆర్జించలేకపోయ్యాను; కవినీ కాలేకపోయ్యాను. నీలాంటి వస్తువు తన్మయత యివ్వనందున, కవిత్వం చేతకాక వేదాంతంలో పడ్డాను. పాఠాలు బోధించాను. వృథావైన జ్ఞానంవల్ల నే తెలుసుకున్న గొప్పసత్యం జ్ఞానం వృథా అని. నిజమైన కవినైవుంటే లోకం నన్ను గుర్తించివుండదు. చెప్పాగా స్వార్థంలేని మంచితో సంఘానికి నిమిత్తం లేదని.

తమా—నేడు నన్ను కోరి, రేపు మరొకర్ని కోరే మీపై నాకు నమ్మకం ఎల్లా వుంటుంది, ప్రభూ ?

ఒమార్—నాకు రేపు లేదు స్త్రీ. నేను జన్మించిందీ, జీవించిందీ నేడే. నాకవిత్వంలోని మొదటిపాఠం అదే. శరీరం ప్రధానమైనది. దాన్ని నశింపజేసేది ఆలోచన, ఊహ. వీటియత్నాలకి తావులేకుండా, వీటిని చొరనీకుండా, శరీరానికి సదా కాలక్షేపం కల్గించాలి. ఇది నా రెండోబోధ. ఇదీ అందరికీ యిష్టమే. కాని అందరూ తాము సృష్టించిన మాయసంఘాన్ని నిలబెట్టేందుకు నీతిని సృష్టించి, దాన్ని నిలబెట్టేందుకు శరీరాన్ని దూషిస్తారు. నీలోపల నీకే శరీరం ముఖ్యమని తెలుస్తుంది.

తమా—కాని, నాకు ఆత్మ వుంది.

ఒమార్—అది అనుమానాస్పదం. ఉంది అని అనుకునేటట్లు నీబుర్రని చిన్నప్పటినుంచీ సంఘం తరిఫీదు చేసింది. అనుమానింపబడ్డ ప్రతివస్తువూ అసత్యం, అనవసరమని నా మూఢోపాఠం.

తమా—స్వామీ, మీపాఠాలు రుచించలేదు నాకు. కాని మిమ్మల్ని చూస్తే జాలిగా వుంది. పాపం, మీకేమీ లేదు — ఎవ్వరూ లేరు.

ఒమార్—అవును స్త్రీ, స్వార్థంలేని నిర్భాగ్యుడు కవి వొక్కడే. వాడేమీ కోరడు, ఆశించడు, యత్నించడు. నావూహ ఎగిరిపోయి తిరిగితిరిగి సౌందర్యాన్ని వేటాడి, అలిసి, విశ్రాంతికోసం కిందికి దిగి, నీకనురెప్పలో, నీఅధరాల్లో వెదుకుతుంది. అందుకని నువ్వవసరం.

తమా—అన్యాయం ప్రభూ. పరాయిస్త్రీని. యిట్లా కోరడం న్యాయమా?

ఒమార్—నువ్వు అంగీకరించకపోతే ఒమార్‌జీవితంలో గొప్ప కవిత్వం నశిస్తుంది. అలిసిపోయిన ఊహ, భావాలు కుంటువడి, కదలక కుళ్లిపోతాయి. అలసట తీర్చి, వాటికి నువ్వే జీవంపోసి, కవిత్వాలోకాన్ని గొప్పదాన్నిగా చెయ్యాలి. ఈసమయంలో మనిద్దరి స్నేహంవల్లా ప్రపంచం అనుభవిస్తుంది ముందు.

తమా—నాకు ప్రపంచంతో నిమిత్తం లేదు.

ఒమార్—అవును మరిచాను. నీకు నీగొడవే. పోనీ, ప్రపంచం నిన్ను ఫలానా ఒమార్ ప్రేమించిన స్త్రీ అని చెప్పుకుంటుంది. నా పద్యాలద్వారా అమరత గడిస్తావ్. నాపద్యాలు నీకు జన్మించిన సంతానం, నీసృష్టి.

తమా—ప్రభువుని చూస్తే జాలిగా వుంది. సంతానంలేని నాకు తమరు పసిపాపలా వున్నారు. లేదు కుట్ర మీలో; మోసం లేదు. మిమ్మల్ని లాలించాలని వుంది.

[ప్రవేశం : సేవకుడు]

సేవకుడు—రాణీ, నమస్కారం. మురాద్‌ప్రభువు విహారం ముగించి తమకోసం సిద్ధంగా వున్నారు. ఒంటె సిద్ధంగా వుంది.

ఒమార్—(ఆశ్చర్యంతో) ఈస్త్రీ మురాద్‌సతా? ఒమానా యువరాణీ?

తమా—ఒమార్, భయపడనక్కరలేదు. ఒమార్‌ను చేసిన పరీక్ష రాణీకి ఎంతో తృప్తికరంగా వుంది. నువ్వు మొదట్లోనే నన్ను రాణీనని తెలుసుకున్నావ్. నువ్వు నిజమైన మానవుడవు.

ఒమార్—మరి తమరు ఆగానిగురించి వేసిన ప్రశ్నలు?

తమా—ఆగాభార్య నాతో చెప్పుకుని మొరెట్టుగుంది. నువ్వు చాలామందికి అన్యాయం చేస్తున్నావని విన్నాను. అది పొరపాటు. నీబోధనలు కొన్ని సంఘానికి సరిపడకపోయినా, నువ్వు నిజమైన మనిషివి. నీ బ్రదుకంతా 'బాల్యం'అన్నమాటలో వుంది. నీకోర్కె ఏమిటి? రాణీ సిద్ధంగా వుంది అర్పించడానికి.

ఒమార్—ధనం వొద్దు రాణీ.

తమా—అంతకంటె నీ కవసరమైనది ఏదైనాసరే కోరుకో.

ఒమార్—చెప్పడం చేతకాదు, రాణీ. క్షమించమని కోరడం కోర్కె ఐతే అదే యివ్వండి. నాకోర్కె వొకటే. తమరు జీవితాన్ని అనిశ్చలమైన తర్కంతో, వివాదనలతో మలినంచేసుకోకండి. శరీరం గతించేవరకేనా వుంటుంది. కాని జ్ఞానం, తర్కం, నీతినియమాలు, సంఘఆదర్శాలు జనించిన మరుక్షణంలోనే గతిస్తాయి. శరీరం, తనని గుర్తించరేమో అని భయపడి, మనస్సు, ఆత్మ అన్న భ్రమలని వూహించుకుంది. అంతే. నవ్వుతున్నారు మీరు. ఓహో, చంద్రబింబం యీదృశ్యాన్ని చూసి సిగ్గుపడి మేఘాన్ని ముసుగులా కప్పుకుంది. అయ్యో! రాణీ, వెళ్లిపోతున్నారా? ఈబీదవాడు ఏకానుక యివ్వగలడు? చంద్రుడు ముసుగుతీసి బోసిగా

నవ్వుతున్నాడు. ఏదీ నాహ్రాము—ఆగా, దా, రావోయి సోదరా. యీఆనందంతో వెలిగిపోతున్న నాహృదయం వేగంగా కొట్టుకుని భగ్నంకాకుండా అదిమిపట్టవోయి......

[ఆగాషాహి వొగర్చుకుంటూ వొస్తాడు]

ఆగా—గురుజీ మధులో మైకంచెంది వున్మాదంలో వున్నారు. మన హ్రాము లేచిపోయింది. ఎవడో మురాద్ గాడుట-వాడితో ఒంటెక్కి చక్కా పోయిందిట......

ఒమార్—అల్లాహో దుష్మన్! మనతో మాట్లాడినది మురాద్ భార్య. మురాద్ మన యువరాజు. పిచ్చి ఆగా—మోసంచేసి హ్రాముని తీసుకుపోయి రాజుకి వొప్పగించేందుకు వేసిన పన్నాగం అన్నమాట! ఘోరం. పద పోదాం. రాణీ లొద్దు; రాజ్యాలొద్దు. మన హ్రామునేనా మనకివ్వరా ?

ఆగా—ఆ మురాద్ ని కొట్టి తీసుకొస్తా. నాదగ్గర సాగవ్. ఆమురాద్ గాడి పెళ్లాన్ని చూస్కో ఏం చేస్తానో...క్షమించండి, కోపంలో మిమ్మల్నికూడా 'నువ్వు' అన్నందుకు.

ఒమార్—శాంతించు ఆగా......వారిని దూషించకు. తప్పు హ్రాముది. అది తలకాయలేని శరీరం అని వెనకే అన్నానుగా. ధనం, ధనం, డబ్బు—అదే లోకంఘోష. అదే దాన్ని మోహించింది. ఆగా, స్త్రీ బీద వాణ్ణి క్షమించదు. ఈపాడుసంఘం యిద్దరేసి బీదపురుషులకు కలిపేనా వొకస్త్రీ నివ్వదా ?

ఆగా—సంఘ మిచ్చేదేమిటి ? సంఘాన్ని చావతన్ని తీసుకుంటా.

ఒమార్—నెమ్మది—మెల్లిగా...గాలి యీ మాటలు విని ప్రపంచంలోకి మోసుకుపోతుంది. మన గుర్రం సిద్ధంచెయ్యి.

ఆగా—సిద్ధమని యింకా మెల్లి గా అంటారేమిటి ?

3

ఆరాత్రే. మురాద్ భవనం. తోటలోనికి ప్రవేశం ఒమార్, ఆగాషాహి. దూరంగా మండువాపై మంచంమీద మురాద్ త్రాగి పడుంటాడు. ఆఅవస్థలోనే హ్రామునిస్సా అతని తొడపై పడివుంటుంది.

***

ఆగా—హ్రాము, హ్రాము !

ఒమార్—ఉస్-మెల్లగా. అనుభవంలో వున్నవారిని భంగంచెయ్యడం మన మతానికే వ్యతిరేకం.

ఆగా—ఇప్పుడేం మతం గురూ. ఎక్కడ? (చప్పట్లు కొడతాడు)

ఒమార్—మెల్లగా. అరుగో. ఏశరీరసుఖానికి తంటాలుపడుతున్నారో ఆశరీరాన్నే మరిచి, బరువైన నీటిని వర్షంద్వారా వొదులుకుని గాలికి కొట్టుకొనిపొయ్యే మేఘద్వయంలా అరుగో....

ఆగా—ఇప్పుడెవడి క్కావాలయ్యా కవిత్వం...నాహ్రాము...

ఒమార్—దోషం నోరు నొక్కుకో. నాబోధనలని, అభిప్రాయాలని ఆచరణలో పెడుతున్న హ్రాముని మెచ్చుకోవడంబదులు దూషిస్తున్నావు. ఒక్క శిష్యురాలికి నాఘోష బోధపడిందంటే నాకు గర్వంగా వుంది. హ్రాముని వొదిలిపోదాం.

ఆగా—నన్ను ప్రేమించానంది.—మీ కవసరంలేకపోతే అంతేనా ఏమిటి?

ఒమార్—పిచ్చివాడవు పురుషుడా. మట్టికుండతో నీళ్లుత్రాగే, నాలాంటి నిర్భాగ్యుడవైన నిన్ను హ్రాము ప్రేమించడం సంభవంకాదు నాయనా.

తమా—దానికి డబ్బెందుకు? నాకు బాగా మాటలు చేత నవునని ప్రేమించానంది.

ఒమార్—'ప్రేమ'అనేది శరీరవాంఛకి మానవభాష కల్పించిన మధురమైన పేరు. లేదు నాయనా స్త్రీల కది. ధనికుణ్ణి ప్రేమిస్తే వారి స్వార్థం తీరుతుంది. ఎన్నో నగలు పెడతాడు. వజ్రాలతో ముంచుతాడు. వెండిపాన్పుపై పవళిస్తుంది. బంగారాన్ని రేకుగా కొట్టి కప్పుకుంటుంది. స్త్రీలోకానికి చూపి పూరిస్తుంది, తన సంపద. ఇతరస్త్రీలు అసూయపడితే తన ప్రేమ పూర్తిఅవుతుంది. అందరికీ అలభ్యంగా కనపడడం, అందరూ తనకోసం వేటాడ్డం—యిదీ ఆమెకోరేది...

ఆగా—ఈవుపన్యాసా లెందుకయ్యా? ఇందాకా ఎన్నోకబుర్లు చెప్పింది; ఎన్నో ప్రమాణాలు చేసింది.

ఒమార్—వేటకి రగిల్చి వెళ్లింది రాజుతో, నీకు మరింత దుర్లభం అవడంకోసం. ఓహో రాణీ—వెన్నెట్లో విరిగిపడ్డ మంచిగంధపు ప్రమానులా...

ఆగా—ఈవుపమానాలు వింటే కడుపు నిండదు. కర్తవ్యానికి దిగండి. హమ్రు, హమ్రు...

హమ్రు—ఎవ డది? లేదు నాకు నిద్ర, నిద్ర నాకు లేదు.

మురాద్—నిజం...ఒంటె నెక్కితి నేను.

హమ్రు—పేరులేదు నాకు,—లేదు నాకు...

మురాద్—ఇయ్యి ముద్దు.

ఆగా—ఓర్. మనముందే,—తాగి, పైగా ముద్దుట.

తమా—కవీ, నువ్వు హమ్రుకోసం వొచ్చావని విన్నా.

ఆగా—నేనూ అందుకే వొచ్చా.

తమా—హమ్రు నాప్రభువుని వొదిలివెళ్లనని వాగ్దానం చెయ్యగా విన్నాను.

ఆగా—మీరు యివన్నీ విని, చూసి వూరుకున్నారా?

తమా—ఈ అనుభవం నాకు కొత్తకాదు.

ఆగా—నాభార్యముందు యిట్లాంటి పని చేస్తే నన్ను నరికి ముక్కలుచేసి...

ఒమార్—ప్రజల పాపాలని రాజు భరిస్తే, రాజుపాపాలిని రాణీ భరిస్తుంది.

తమా—ఎంతకాలం? నాకు కోర్కెలు లేవా? వాంఛలు లేవా? ఒమార్, నేను, నిన్ను...

ఆగా—ఇదేం గొడవ? రాణీముందు రాజు, రాజుముందు రాణీ, మాముందు హమ్రు,—ఇదేం శృంగారం,—నాకు అయోమయంగా వుంది.

ఒమార్—స్త్రీ! నువ్వీఆశలు వొదులుకో. మహారాజుభార్య వన్నదానికంటే వేరేభాగ్యం నీకేం కావాలి? పైగా నిన్ను పోషించేందుకు నాదగ్గర యేమీ లేదు. నా నారచాపలు, నాపుర్రెలు, నా అర్థశూన్యమైన పాటలు నీకెందుకు స్త్రీ? భాగ్యాన్ని రుచిమూచిన నువ్వు నన్ను విడిచి రేపే వొచ్చేస్తావు.

తమా—కవీ, నీకు 'రేపు' లేదన్నావు?

ఒమార్—నాకు లేదు. కాని నీకు వుండొచ్చు. స్త్రీ, నాకు నీమీద భౌతికవాంఛకూడా లేదు. నిన్ను చూస్తే తన్మయత పొందొచ్చు. నిన్ను తాకితే ఫలితం, ఎండిన నాలుక, కాలిపొయ్యే నుదురు, ఇగుర్చుకుపోయిన కంఠం, నీరసించిననరాలు...నేను కవిగా వుండడం నీకిష్టంలేకపోతే నాతో రావొచ్చు స్త్రీ! నాకసి, నా కోర్కెలు కవిత్వంద్వారా తీర్చుకొని, ఆధ్యాత్మికంగా ఆదర్శం నెరవేర్చుకుంటాను. నేను కదిలి కరుగుతూ, మేఘాలమధ్య మాయమైన చంద్రబింబంలా...

ఆగా—మళ్లా మొదలు వుపమానం! కదుల్తున్నాడు మురాద్...ప్రభూ, అది నాహమ్రు. మాతో పంపి వెయ్యండి. ఏం బాగుంది మీకు?

మురాద్—పొయ్యి పానీయం. ఆజుట్టు నాకంఠానికి చుట్టు.

హ్రము—అమ్మో నెప్పి. చలి...నన్ను కప్పుకో నువ్వు. ఒరేయ్ ఒమార్, పగిలిందిరా నీకుండ.

ఆగా—గురూజీ ఉన్మాదంలో వాణ్ణి జడతో వురెట్టి చంపదుకదా!

హ్రము—పగిలింది నీకుండ ఒమార్.

ఒమార్—అయ్యో నా జీవితకలశం భగ్నమైందా! మధు దేనితో త్రాగేది? అమ్మ తమారాజీవా—నాకు వొద్దమ్మ నువ్వు. బంగారంతో బూజుపట్టిన నీబుజాలను నే భరించలేను. వొద్దు నాకు హ్రము. స్త్రీలోకంతో నాకున్న బంధనాలు త్రెంపవోయి ఆగా.

తమా—ఒమార్, నీమధురగానం వొక్కసారి వినిపించవు? నీ ఏకాంతస్వప్నాలకు కారణం నన్నే అవనీ. ఈపాడుపడ్డ జనానాలోంచి నన్ను విముక్తురాలుని చేసి, నీవేదాంతంలో నాకు శాశ్వతమైన కీర్తి తెచ్చిపెట్టవు? పసిపాపలాంటి నీ హృదయాన్ని హస్తాలలో తీసుకుని లాలించాలని వుంది.

ఒమార్—అయ్యో! అంగీకరించడానికి నానోరు పడిపోయింది స్త్రీ. ఈమట్టితో మలినమైన బ్రతుకులో మెరుపు లెందుకు? ఈ నిరంతర ఎడారిలో వడగళ్లా! నాపాటలో ప్రాణుల నిట్టూర్పులు వినిపించకూడదు స్త్రీ. నాకవిత్వాన్ని మలినం చెయ్యకు.

ఆగా—ఏయ్ హ్రము, వొస్తావా రావా?

హ్రము—ఎవడ్రా వాడు? ఉరితీయిస్తా నన్ను కాదన్నవాణ్ణి. మురాద్‌ముద్దులో రత్నాలు, వేడికి వూడిపడ్డాయి, వొచ్చి ఏరుకుపోరా ఒమార్.

మురాద్—పగిలిన కుండలో పడుకో.

ఆగా—ఛ, ఛ! నే వుండను, గురూ.

ఒమార్—చీకటితో నిండుకున్న మట్టికుండ నేటికి పగిలి వెలుగుని చూచింది. అల్లా కుండలకి అతుకు పెట్టడం మానుకున్నాడు. పోదాం పద. వొద్దు మనకి, వొంకరనడుములూ, పాపంతో వొణికే అధరాలూ, కత్తిలా కాలిపొయ్యే రొమ్ములూ...

తమా—నేనూ వొస్తా నీతో..

ఒమార్—వొద్దమ్మ స్త్రీ. వజ్రాలని ఏరుకుని, సింహాసనం ఎక్కి, నీభర్తశవంపైన నాట్యం చెయ్యి.

[మురాద్ పానకలశాన్ని నేలమీద విసిరికొడతాడు]

ఒమార్—ముక్కలై శూన్యంలో నాట్యంచేస్తోంది కలశం. నువ్వూ వస్త్రాలు తీసి, బరువుతగ్గించి నాట్యం చెయ్యి....వొచ్చినదారినే పోవాలి మనం ఆగా. వెలుగునుంచి వొచ్చాం మనం, వెలుగులోకే పోవాలి. స్వర్గాన్నుంచి వొచ్చిన పాపి మళ్లా స్వర్గానికే. అదుగో తెల్లారుతోంది. చీకటికుండనుంచి వెలుగుముద్దని తూర్పు ఆకాశంలోకి ఎవరో విసిరారు. కిరణం నన్ను పిలుస్తోంది. ప్రకృతి తనని ముద్దాడడానికి రమ్మంటోంది. వేదాంతులు బోడిబుర్రలను వూపుకుంటూ, పగలు పగలేనా అని ప్రశ్నించి అలిసిపరున్నారు. పద విశాల ప్రపంచంలోకి. భగ్నమైన కుండకి అతుకుపెడదాం పద.

తమా—మురాద్ ప్రభూ, తెల్లవారింది.

హ్రము—నా కింకా చీకటే, లేవకు మురాద్. నాజుట్టుతో నేత్రాలని కప్పుకో.

ఆగా—కప్పుకుని గోరీ కట్టించుకో.*

---

*ఒమార్ ఖయ్యాం పద్యాలను ఇంగ్లీషులోకి అనువదించిన ఫిట్ జెరాల్డు తన స్నేహితుడికి వ్రాసిన ఒక లేఖలో "ఒమార్‌ని పరీక్షించడానికి పర్షియారాణి మారువేషంతో వచ్చిందని యిప్పటికీ అక్కడిజనం చెప్పుకొంటూవుంటారు" అని వ్రాశాడు. ఇదే యీ నాటికలో కల్పితగాథకు ఆధారం.